## క్లుప్తంగా

### విగ్రహ ప్రతిష్టాపన



పూజల్లో పాల్గొన్న జీఎం దంపతులు, అధికారులు

**రామకృష్ణాపూర్:** పట్టణంలోని మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ కనకదుర్గాదేవి విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిత్యపూజలు, దేవతామూల మంత్ర హవనము తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ దంపతులు, రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్ దంపతులు, బెల్లంపల్లి జీఎం దేవేందర్, ఎస్ఓటు జీఎం ఓదెలు, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### నీటి సమస్య తీర్చాలని వినతి

**మంచిర్యాలఅర్బన్:** జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బోర్‌వేసి నీటి వసతి కల్పించాలని కోరుతూ శనివారం స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావుకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. వేసవిలో ఎండలు.. పాఠశాల సమీపంలో నెలకొల్పిన పలురకాల వ్యాపార సముదాయాల కారణంగా బోర్‌బావి ఎండిపోయి నీటికి కటకట ఏర్పడుతుందన్నారు. పాఠశాల నిర్వాహణకు మధ్యాహ్న భోజనం, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందించటం కష్టంగా మారిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భవిష్యత్‌లో విద్యార్థులకు నీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యోగేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని నర్సింగాపూర్‌లో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి హాజరై కిసాన్ సంఘ్ పతాకావిష్కరణ చేసి భరతమాత చిత్రపటం వద్ద పూలు సమర్పించారు. పిడుగుపాటు, పాముకాటుతో చనిపోయిన రైతులకు, కూలీలకు రూ.ఆరు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అడవి పందులు, కోతులతో పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బద్రినారాయణ, అశ్విన్, తిరుపతిరెడ్డి, కరుణాకర్, తిరుపతి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

### ‘అక్రమ పట్టాలపై విచారణ జరపాలి’

**జన్నారం:** మండలంలోని తపాలపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధుల కుమారులపై చేసుకున్న అక్రమ పట్టాలపై అధికారులు విచారణ జరపాలని పీఏసీఎస్ చింతగూడ వైస్ చైర్మన్ కమ్మల విజయధర్మా డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరాయిపేట శివారులో చెరువు శిఖం భూమి కబ్జాపై గ్రామస్తులకు అండగా ఉంటామన్నారు. మండలంలో చెరువు భూములు కబ్జాకు గురవుతున్నందునా, ఈ విషయంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కబ్జా చెరలోని భూములను బయటకు తేవాలని కోరారు.

### నర్సరీల సందర్శన



**భీమారం:** మండలంలోని పోలంపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఎండల నుంచి మొక్కలను కాపాడాలని, ప్రతి రోజూ నీటిని అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో సతీశ్ రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములను కాపాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రాజు, నాయకులు

**నస్పూర్:** పట్టణంలోని పలు ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ కౌన్సిలర్లు కబ్జాలు చేస్తున్నట్లు, ఆ కబ్జాలను అరికట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సత్రం రమేశ్, జిల్లా నాయకులు తులా మధుసూధన్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు, నాయకులు మిట్టపల్లి మొగిళి, మహేందర్, రాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ.. రంగోలీ!



సండే స్పెషల్

హోలీ పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఇప్పటికే రంగుల దుకాణాలు వెలిశాయి. అంగరంగ వైభవంగా, ఆనందోత్సాహాల మధ్య ఉత్సాహంగా, ఉల్లాసంగా కలర్‌ఫుల్‌గా జరుపుకునేలా చిన్నారుల కోసం పలు రకాల హోలీ రంగులు, చల్లుకునే గన్‌లు, బొమ్మలు, బెలూన్లు అందుబాటులోకి వచ్చాయి. స్కూల్ బ్యాగుల ఆకారంలో వచ్చిన రంగులట్యాంకులు పలువురిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ వివరాలతో కథనం...

– మంచిర్యాలటౌన్

● మార్కెట్లో మొదలైన సందడి ● ఆకట్టుకునేలా కలర్లు ● చిన్నారులకు ప్రత్యేకంగా గన్‌లు, బెలూన్లు ● స్కూల్ బ్యాగు మాదిరిగా కలర్ ట్యాంకులు



జిల్లా కేంద్రంలో ఓ దుకాణం వద్ద కొనుగోలు చేస్తూ...



స్కూల్ బ్యాగు ఆకారంలో..

**పిల్లలకు ఇష్టంగా ఉండేలా..**

హానికరంగా లేని కలర్లు అమ్ముతుండగా, ఆయా కలర్లను నీటిలో కలుపుకుని, వాటిని బెలూన్లలో నింపి, ఒకరిపై ఒకరు విసురుకుని ఆనందించేలా మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇక కలర్లు రూ.2నుంచి రూ.100వరకు లభిస్తుండగా, గులాలు రూ.40నుంచి రూ.120వరకు కలర్‌ను పిచికారీ చేసే పంపులు రూ.10నుంచి రూ.200ల వరకు ఉన్నాయి. ఇక స్కూల్ బ్యాగు ఆకారంలో తయారు చేసే బ్యాగు సంచి వంటి ట్యాంకులు రూ.150నుంచి రూ.800వరకు ఉండగా, వీటిని ప్రముఖ క్రికెటర్ల ముఖాలుగా, కార్టూన్‌లలో ఆంగ్రి బర్డ్స్, మిక్కి మౌజ్, సినిమా హీరోలు, దేవుళ్ల ఆకారాలు ఇలా ఎన్నో రకాలుగా ఉండి ఆకట్టుకుంటున్నాయి. ఇక గన్‌లను చిన్నారులు ఇష్టంగా తీసుకునేలా మంచి కలర్స్, వెరైటీ డిజైన్లతో రూపొందించి అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలకు ప్రస్తుతం ట్రెండింగ్ అయ్యే డిజైన్లను ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి నగరాల నుంచి మంచిర్యాలకు తీసుకొచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ఏడాది హోలీ వ్యాపారం సైతం ఎక్కువగానే ఉంటుందని వ్యాపారస్తులు అంచనా వేస్తుండగా, ఈ ఏడాది హోలీ మాత్రం చిన్నారులను ఆకర్షించే విధంగా, మార్కెట్లో గన్‌లు అందుబాటులో ఉన్నాయి. సహజ రంగులనే వాడినా, రంగులు కళ్లల్లో పడకుండా చిన్నారులు, పెద్దలు జాగ్రత్త వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

#### చిన్నారుల కోసమే వచ్చాయి..



ఈ ఏడాది హోలీ పండుగకు ఎక్కువగా చిన్నారులను ఆకర్షించేలా గన్‌లు, హోలీ గులాలు, పంపులు, బెలూన్లు ఎక్కువగా వచ్చాయి. బెలూన్లలో రంగు నీటిని నింపి, విసురుకునేలా ఉన్నవి అందుబాటులో ఉన్నాయి. అందరికీ అందుబాటులో ఉండేలా ధరలు ఉన్నాయి. కార్టున్లు, సినిమా హీరోలు, క్రికెటర్లు ఇలా రకరకాల బొమ్మలతో కూడిన కలర్ నింపుకునే బ్యాగు ట్యాంకర్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. సహజ రంగులను మాత్రమే చిన్నారులు, పెద్దలు వాడాలి.

– గుండ శ్రీనివాస్, వ్యాపారి, మంచిర్యాల

#### చాలా బాగున్నాయి



హోలీ పండుగ వచ్చిందంటే మా ఫ్రెండ్స్‌తో కలిసి రంగులను చల్లుకుని ఆనందంగా జరుపుకుంటాం. రంగులు చల్లుకునేందుకు గన్‌లు వచ్చాయి. స్కూల్ బ్యాగ్‌ను వేసుకునేలా వచ్చిన రంగుల బాక్సులు సూపర్‌గా ఉన్నాయి. గన్‌లలో చిన్నవి, పెద్దవి ఉన్నాయి. ఫ్రెండ్స్‌తో కలిసి రంగులను చల్లుకుంటూ ఆడుకునేలా ఎన్నో రకాలు ఉన్నాయి. కలర్ వాటర్‌ను బెలూన్లలో నింపుకుని, వాటిని ఫ్రెండ్స్‌పై వేసేలా వచ్చినవి బాగున్నాయి.

– డి. వర్షిత్, విద్యార్థి

## రెబ్బనపల్లి పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఈవో

**దండేపల్లి:** ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుతో పోటీపడి, వాటికి ధీటుగా విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యేతో పాటు, డీఈవో వెంకటేశ్వర్లు, ట్రైనీ కలెక్టర్ గౌతమి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన చేయడంతో పాఠశాలలో అడ్మిషన్లకు పోటీ ఏర్పడిందని, ప్రతి ప్రభుత్వ పాఠశాల రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ మౌనిక, ఎంఈవో రవీందర్, నోడల్ అధికారి సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్ఎం రవీందర్, పాఠశాల హెచ్ఎం అర్చన, ఎస్ఎంసీ చైర్మన్ వినోద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీలో డబుల్ బెడ్ రూం ఇళ్ల జాబితా రూపకల్పనలో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే ఇళ్ల కేటాయింపు జరుగుతుందని మండిపడ్డారు. పేద ప్రజలకు అన్యాయం జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. నిజమైన నిరుపేదలను గుర్తించి వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని, లేనకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. నాయకులు ఆరుముళ్ల పోషం, సత్యనారాయణ, జంగంపల్లి మల్లయ్య, వైద్య శ్రీనివాస్, మేదరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి



ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవి

**మందమర్రిరూరల్:** మండలంలోని అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గుర్రం మంగ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా సభ్యులు పలు సమస్యలను ఎంపీపీ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంచిర్యాల నుంచి భీమారం వరకు ఆర్టీసీ బస్ నడపాలని మండల కో ఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్ ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావును నిలదీశారు. రూట్ క్లియర్ లేదని సర్దిచెప్పే ప్రయత్నాలు చేయగా, జెడ్పీటీసీ వేల్పుల రవి డీఎంతో ఫోన్లో మాట్లాడారు. రూట్ క్లియర్‌గా ఉందని తెలుపడంతో బస్ భీమారం వరకు నడపడానికి అంగీకరించారు. మామిడిగట్టులో విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఆవడం నుంచి సరఫరా ఉండగా మందమర్రి నుంచే సరఫరా చేయాలనే తీర్మానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అడవిలో శుభకార్యాలకు పాలపొరుక కోసం వెళ్తే అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారని, పాలపొరుకకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. పలు గ్రామ పంచాయతీల్లో విద్యుత్ తీగలు కిందకు జారుకున్నాయని వెంటనే సరిచేయాలని తెలిపారు. గ్రామాల్లోని చెరువులకు సంబంధించిన శిఖం భూములను సర్వే చేసి కాపాడాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పీఏసీఎస్ ప్రభాకర్ రావు, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

## విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ సునీల్

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల ఒత్తిడి, ఇతర మానసిక సమస్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో పిల్లలకు స్ట్రెస్, రిలీఫ్ అండ్ ఎగ్జామ్ ఫోబియా అనే విషయాలపై శనివారం సైకియాట్రిస్ట్ వైద్యుడు సునీల్ కుప్లంగా వివరించారు. పరీక్షల సందర్భంగా ఒత్తిడులకు గురికాకుండా విద్యారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.



కోటపల్లి: జనగామలో అవగాహన కల్పిస్తూ..



కాసిపేట: కోనూరులో మాట్లాడుతున్న సీడీపీవో



తాండూర్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మమత

## సమాజంలో మహిళల పాత్ర కీలకం

**మంచిర్యాలటౌన్/కోటపల్లి/తాండూర్/కాసిపేట/జైపూర్/భీమిని:** జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాసిపేటలో సీడీపీవో ఉమాదేవి పాల్గొని సమాజంలో మహిళల పాత్రపై వివరించారు. బాల్యవివాహాలపై, మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ముగ్గుల పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు, యువతులపై ఎలాంటి అఘాయిత్యాలు జరిగిన 1098హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. జిల్లా కేంద్రంలో వార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, కోటపల్లిలో సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ తిరుపతి, తాండూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, సింగరేణి హైస్కూల్ పీఈటీ భాస్కర్, సింగరేణి సేవా సమితి సభ్యులు ఝాన్సీ, సౌజన్య, కాసిపేటలో సర్పంచ్ స్వరూప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, జైపూర్ మండలం ముదిగుంటలో ఎంపీపీ గోదారి రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, సర్పంచ్ దూట జ్యోతి, భీమిని మండలం వీగాంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జైపూర్: ముదిగుంటలో ఎంపీపీకి సన్మానం



భీమిని మండలం వీగాంలో...



జిల్లా కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

## సమాచారం

### దరఖాస్తులకు గడువు పెంపు

**కాసిపేట:** స్థానిక మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో వంద సీట్లు 7, 8, 9, 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశానికి దరఖాస్తుల గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు గడువు పెంచినట్లు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు ప్రజాస్వామిక వాదుల సదస్సు

**పాతమంచిర్యాల:** ప్రభుత్వ పాలనలో ప్రజలందరికీ సమాన భాగస్వామ్యం కల్పించాలని, పౌరసమాజం తమ కర్తవ్యాన్ని చర్చించుకోవడానికి «ప్రజాస్వామాన్ని రక్షించుకుందాం» అనే నినాదంతో జిల్లా కేంద్రంలోని చార్వాకట్రస్టు భవన్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ప్రజాస్వామిక వాదుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల నాయకులు శ్రీమన్నారాయణ, ఆడెపు సమ్మయ్య, జైపాల్ సింగ్, దేవిసత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్ దేశాయి హాజరవుతున్నట్లు ఈ సమావేశానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

### నియామకం

**మందమర్రిరూరల్:** ఏప్రిల్ మాసం 9, 10తేదీల్లో తిరుపతిలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 48గంటల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల ఆర్గనైజింగ్ కమిటీలో సభ్యుడిగా మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన కాపురపు రవికుమార్‌ను నియమిస్తూ ప్రపంచ తెలుగు సాహితీ సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆదేశాలు జారీ చేశారు.

### కమిటీ ఎన్నిక

**శ్రీరాంపూర్:** సింగరేణిలో ఏఐటీయూసీకి అనుబంధంగా పని చేస్తున్న సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌కు శ్రీరాంపూర్ బ్రాంచీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో శనివారం ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అధ్యక్షతన బ్రాంచీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో బ్రాంచీ ఉపాధ్యక్షుడిగా రాచర్ల చంద్రమోహన్, కార్యదర్శిగా బూర వీరేశం, సహాయ కార్యదర్శులుగా చిలుక రాంచందర్, కామెర వేణు, అక్కల నాగరాజు, చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా డీ వెంకటేశ్, నాగరాజు, ధనిశెట్టి లక్ష్మి, చిప్పకుర్తి రవి, కోశాధికారిగా పళ్ల సత్యంతో పాటు 11మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ మోతుకూరి కొమురయ్య, సహాయ కార్యదర్శి గునిగంటి నరసింహారావుతో పాటు వంద మంది కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

### సర్పంచ్‌కు గంగపుత్రుల వినతి

**తాండూర్:** మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేయడానికి గ్రామపంచాయతీ తీర్మానించాలని సర్పంచ్‌కు వినతిపత్రం అందించడానికి వెళ్తే, ఆయన లేకపోవడంతో గంగపుత్రులు 3గంటల పాటు పడిగాపులు గాశారు. తాండూర్ మండలం రేచిని గ్రామంలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. అనంతరం మత్స్య సహకార సంఘం ఏర్పాటుకు కృషి చేయాలని, పంచాయతీ తీర్మాణం చేయాలని వినతిపత్రం అందజేశారు.

### ‘భూమి ఆక్రమించుకొని బెదిరిస్తున్నారు’

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి రైల్వే రడగంబాల బస్తీలో తమ తండ్రి కష్టార్జితంతో కొనుగోలు చేసిన భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసి అమ్ముకుంటున్నారని, అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు మువ్వ జ్యోతి, ప్రకాష్, ఆశీర్వాదం,సాజన్,బీనా తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం బాధితులు విలేకరులకు గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే, భూ ఆక్రమణకు పాల్పడిన వ్యక్తుల పేర్లురాసి కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంటామన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఉపాధిహామీ పనుల పరిశీలన**

**భీమిని:** మండలంలోని కేస్లాపూర్‌లో శనివారం ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సబ్దర్‌ఆలీ పరిశీలించారు. ఉపాధిహామీ సిబ్బందితో పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేస్లాపూర్ నర్సరీని సందర్శించారు. ఏపీవో భాస్కర్ రావు, టెక్నికల్ అసిస్టెంట్ వేణు, సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

**పాఠశాల సందర్శన**

**జైపూర్:** మండలంలోని కుందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను చెన్నూర్‌కు చెందిన చిత్రకళా యాత్రికుడు ఎల్పుల పోచం శనివారం సందర్శించారు. తన కళాయాత్ర అనుభవాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు. ఇప్పటివరకు 25రాష్ట్రాలు సందర్శించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో సన్మానించారు.

**అవగాహన**

**కాసిపేట:** మండలంలోని మల్కెపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

**ఆర్థిక సాయం**

**నెన్నెల:** మండలంలోని మైలారం, గొల్లపల్లి గ్రామాలకు చెందిన నిరుపేదలు మానపల్లి శంకర్, బద్రి నారాయణ ఇటీవలే మృతి చెందారు. వారి కుటుంబాలను గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్ పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు నగదు అందజేశారు.